



లలిత కళా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు



అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

గర్జన

- కలెక్టరేట్ ముట్టడి
- జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలొచ్చిన అంగన్‌వాడీలు
- ఎల్‌కెపి నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- మధ్యాహ్నం 4 గంటల వరకు కలెక్టరేట్ ఎదుట బైటాయింపు
- ఎర్రజెండాలతో ఎరుపెక్కిన అనంత
- సిఐటియు, ఐద్వా, రైతు, కౌలు రైతు, వృకాసం,ఎస్ఎఫ్ఐ మద్దతు

పోరు ముగింట అంగన్‌వాడీలు పిడికిలి బిగించారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా మొద్దునిద్రను ప్రదర్శిస్తున్న ప్రభుత్వంపై నిరసన జ్వాలను తీవ్రతరం చేశారు. బెదిరింపులు, నిర్బంధాలకు ఐక్య పోరాటంతోనే సమాధానం చెప్పారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న అంగన్‌వాడీలను విధుల్లో చేరాలంటూ ప్రభుత్వం ఛార్జిమెమోల ద్వారా బెదిరించడంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల తీరును వ్యతిరేకిస్తూ అనంతపురం కలెక్టరేట్ ఎదుట బుధవారం నాడు 4 గంటల పాటు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అంతకుమునుపు లలిత కళాపరిషత్ నుంచి వేలాది మంది అంగన్‌వాడీలు భారీ ర్యాలీ చేపట్టారు. ఎర్రజెండాలు, అంగన్‌వాడీల ఎర్రటి దుస్తులతో అనంత వీధులు ఎరుపెక్కాయి. ఎల్‌కెపి వద్ద ప్రారంభం అయిన ర్యాలీ సప్తగిరి సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరి వీడాలంటూ నినదించారు.



అనంతపురం వెళ్లకుండా రాయదుర్గంలో అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు కదంతొక్కారు. ప్రభుత్వ మొండివైఖరిని నిరసిస్తూ ఆందోళనను ఉధృతం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు తెలంగాణా ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు పెంపుదల చేయాలని, న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నాడు కలెక్టరేట్‌ను ముట్టడించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి 23వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా జిల్లా నలమూలల నుంచి వేలాదిగా వచ్చిన అంగన్‌వాడీలు కలెక్టరేట్‌ను ముట్టడించారు. వీరికి సిపిఎం, సిఐటియు, ఐద్వా, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, మున్సిపల్, ఆటో, మధ్యాహ్న భోజన పథకం, యుటిఎఫ్, జెవివి నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు జెండాలు చేతపట్టుకుని అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, తదితరులు మద్దతుగా హాజరయ్యారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకుండా బెదిరింపులకు దిగుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ హెచ్చరించారు. అంగన్‌వాడీలు 23 రోజులుగా ఆందోళనలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వహించడం దుర్మార్గంగా ఉందన్నారు. చర్చల పేరుతో రాష్ట్ర కమిటీ నాయకులను పిలిచి ఆర్థికేతర అంశాలపై మాత్రమే మాట్లాడాలంటూ హుకుం జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమ్మె చేస్తున్నదే ఆర్థిక సమస్యలతో ఉన్నప్పుడు ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించకుండా బెదిరింపు ధోరణులకు దిగడం ప్రభుత్వ దగాకోరు తనానికి నిదర్శనం అన్నారు. అంగన్‌వాడీలను విస్మరిస్తే ప్రభుత్వానికి పతనం తప్పదన్నారు. అంగన్‌వాడీలతో పెట్టుకుంటే ఏం జరుగుతుందో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చంద్రబాబును అడిగి తెలుసుకోవాలన్నారు. మహిళా పక్షపాతి ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటూనే మహిళా కార్మికుల పట్ల కర్కశంగా వ్యవహరిచడం సిగ్గు చేటుగా ఉందన్నారు. హక్కుల కోసం కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగుళగొట్టి కేంద్రాలను ప్రారంభించి బెదిరింపులకు దిగుతోందన్నారు. ఇప్పుడు జనవరి 5వ తేదీ లోగా విధుల్లోకి చేరకపోతే ప్రత్యామ్నాయం చూసుకుంటామనే పద్ధతుల్లో మంత్రులు మాట్లాడటం శోచనీయంగా ఉందన్నారు. ప్రత్యామ్నాయం ప్రభుత్వం కాదు, సమస్యలు పరిష్కరించకపోతే అంగన్‌వాడీలే ప్రత్యామ్నాయంగా మరో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారని హెచ్చరించారు.

బెదిరింపులకు బెదరం
అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి

తాము న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తున్నాం.. దీనిపై స్పందించకుండా ప్రభుత్వం మెమోలిస్తాం.. చర్యలు తీసుకుంటాం.. అంటే బెదిరేది లేదదని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి స్పష్టం చేశారు. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ జిల్లా వాసి అయిఉండి కూడా అంగన్‌వాడీలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయంగా ఉందన్నారు. సమస్యలు చెబుతామని ఆమె ఇంటివద్దకు వెళ్తే పోలీసులతో అరెస్టులు చేయించారన్నారు. ప్రభుత్వం దిగొచ్చి అంగన్‌వాడీలకు న్యాయం చేసే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. సమస్యలు పరిష్కరించకుండా మెమోలిస్తాం, అల్టీమేటం జారీ చేస్తాం, సమ్మె విరమించాలంటే తగ్గదే లేదన్నారు. న్యాయమైన హక్కుల కోసం నిరవధిక నిరాహార దీక్షలకైనా సిద్ధం అవుతామన్నారు.

వైసిపికి పోయే రోజులు దగ్గర పడ్డాయి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

వైసిపి ప్రభుత్వానికి పోయే రోజులు దగ్గరపడ్డాయని, అందుకే అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు, ఎస్ఎస్ఎ ఉద్యోగులతో కయ్యానికి కాలుదువ్వతోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు ఆగ్రహిస్తే రాబోవు రోజుల్లో వైసిపి రాష్ట్రంలో గల్లంతు అవ్వడం ఖాయం అన్నారు. ఆ పరిస్థితులు రాకుండా ఉండాలంటే అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికులు అడుగుతున్న న్యాయమైన వేతనాలు పెంపుదల చేసి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతుసంఘం జిల్లా



అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడిలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

కార్యదర్శి ఎం.బాలరంగయ్య, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి తలారి రామాంజినేయులు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, నాయకులు రమేష్, ఇర్ఫాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్, నాయకులు శివ, గిరి, ఐద్వా జిల్లా అద్యక్షురాలు శ్యామల, జెవివి నాయకులు రామిరెడ్డి, సిఐటియు నాయకులు శివశంకర్, పోతులయ్య, కుళ్లాయప్ప, ఎన్టీఆర్ శ్రీనివాసులు, మల్లికార్జున, జయమ్మ తదతరులు మద్దతుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు జయభారతి, జమున, నాయకులు అరుణ కాత్యాయని, రుక్మిణితో పాటు జిల్లాలోని అన్ని మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటన నేపథ్యంలో పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 6వ తేదీన రాష్ట్ర గవర్నర్ జెఎన్‌టియు స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రానున్నారు. ఇందుకు సంబంధించిన జెఎన్‌టియులో జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6వ తేదీన జెఎన్‌టియులో గవర్నర్ పర్యటన నేపథ్యంలో ప్రోటోకాల్ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. ఎక్కడా అపరిశుభ్రం లేకుండా చూడాలన్నారు. జెఎన్‌టియు ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఏమైనా చిన్న చిన్న సమస్యలు నెలకుని ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఆడిటోరియంలో సీటింగ్ ఏర్పాట్లు, వచ్చిన వారికి తాగునీరు సరఫరా, తదితర ఏర్పాట్లు సకాలంలో చేపట్టాలన్నారు. గవర్నర్ పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడే ఉన్న గెస్ట్‌హౌస్‌లో కూడా అన్ని ఏర్పాట్లు వెంటనే చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, సి.శ్రీనివాసులురెడ్డి, జెఎన్‌టియు ప్రిన్సిపల్ సత్యనారాయణ, రిజిస్ట్రార్ శశిధర్, డైరెక్టర్ విశాల, తహశీల్దార్ బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక



చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరుతున్న అనంతపురం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో అనంతపురం నగరానికి చెందిన ముస్లిం మైనార్టీలు టిడిపిలో చేరారు. బుధవారం విజయవాడలో నిర్వహించిన కదిలిరా టిడిపి పిలుస్తోందిరా కార్యక్రమంలో టిడిపి అనంతపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నేతృత్వంలో నగరానికి చెందిన ముస్లిం, మైనార్టీలు టిడిపిలో చేరారు. అధినేత చంద్రబాబు వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చంనాయుడు, మాజీ మంత్రి కాలువశ్రీనివాసులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక బకాయిలను చెల్లించాలి

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అనంతపురం కలెక్టరేట్ వద్ద 12గంటల పోరుబాట ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర సంపద ఉత్పత్తి రూ.15 లక్షల కోట్లు ఉన్నప్పటికీ ఉద్యోగ ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించలేక ఉన్న ఆదాయ వనరులను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక రకాల ఇబ్బందులకు గురి చేయడం అన్యాయంగా ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాల ద్వారానే ఏదైనా సాధిస్తారని, పైరవీల ద్వారా కాదన్నారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఓట్ ఫర్ ఓపిఎస్ అనే నినాదంతో యుటిఎఫ్ చేసే అన్ని పోరాటాలకు తన మద్దతు ఉంటుందని తెలియజేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లకు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. 2 సంవత్సరాలుగా 1వ తేదీన వేతనాలు అందని దుస్థితి ఏర్పడిందన్నారు. 15వ తేదీ వరకు కూడా చాలా మందికి జీతాలు చెల్లించడం లేదన్నారు. పిఆర్‌సి అరియర్లు, పిఆర్‌సి ముందు కాలం నాటి డీఏ అరియర్లు, కొత్తగా మంజూరు చేసిన రెండు డీఏ అరియర్లు, పిఎఫ్ లోన్లు పార్ట్ ఫైనల్ లోన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ జనవరి 9,10వ తేదీలలో విజయవాడ నందు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 36 గంటల ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ప్రసూన, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజనమ్మ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ధర్నా కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు రాష్ట్ర నాయకులు వి.రాంభూపాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సిఐటియు నాయకులు ఆర్‌వి.నాయుడు, వి.రామిరెడ్డి, మెడికల్ రెప్స్ యూనియన్ శ్రీనివాసులు, రాఘవేంద్ర, ఆర్‌యుపిపి నాయకులు తులసిరెడ్డి, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సుధాకర్ మద్దతుగా హారయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షులు రామప్ప, కోశాధికారి రాఘవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, కార్యదర్శులు హనుమంతు రెడ్డి, ప్రమీల, రఘురామయ్య, సంజీవ్ కుమార్, రవికుమార్, శేఖర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ 12గంటల నిరసన దీక్షలో ప్రసంగిస్తున్న డా॥గేయానంద్

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, మహిళా రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమాపూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జిల్లా గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలేకు నివాళులు అర్పిస్తున్న చైర్మన్, సిబ్బంది

ఎస్ఎస్ఎ ఉద్యోగుల పోస్ట్‌కార్డ్ ఉద్యమం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'ఏళ్ల తరబడి కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నాం... మా ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయింది.. స్పందించి ఎస్ఎస్ఎ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలి' అని ఎస్ఎస్ఎ ఉద్యోగులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి పోస్ట్ కార్డ్ ద్వారా విన్నవించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ ఛైర్మన్ విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమ్మెకు జిల్లాలోని ఎస్-ఎస్ఎ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని ప్రధాన మంత్రి పోస్ట్‌కార్డ్ రాసి తపాల శాఖ ద్వారా పంపించారు. వీరి సమ్మెకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఈశ్వరయ్య, అర్జున్, సాయిరాం, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ హాజరై మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు లీలావతి, చైతన్య, సునీత, నాగరత్న, నరసింహమూర్తి, లక్ష్మినారాయణ, షాజహాన్, జలజాక్షి, మునెమ్మ, సునీత, శ్రీదేవి, రాజశేఖర్, మనోహర్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధానికి పోస్టుకార్డులు పంపుతున్న ఎస్ఎస్ఎ ఉద్యోగులు

జెఎన్‌టియులో ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో వచ్చే సాధారణ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటునకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం నాడు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాలు, రిసెప్షన్ కేంద్రాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి, ఎన్ని గదులు అవసరం అవుతాయన్న వివరాలు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కొత్త మాన్యువల్‌ను అనుసరించి ఎలాంటి ఏర్పాట్లు చేపట్టాలి, తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ గాయత్రి దేవి, ఆర్డీవోలు గ్రంధి వెంకటేష్, సి.శ్రీనివాసులురెడ్డి, జెఎన్‌టియు ప్రిన్సిపల్ సత్యనారాయణ, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్అండ్‌బి ఎస్ఈ ఓబుల్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసనాగ్రహం

ప్రధాన రహదారిపై సహపంక్తి భోజనాలు

సమ్మెలో భాగంగా 9వ రోజైన బుధవారం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు వివిధ రూపాల్లో నిరసనాగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురంలో ప్రధాన రహదారిపై సహపంక్తి భోజనాలు చేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయంలో, కమిషనర్ ఛాంబర్ ముందు చెత్త వేశారు. గుత్తిలో ఒంటికాలిపై నిల్చొని, రాయదుర్గంలో వంటావార్పుతో, గుంతకల్లులో పొర్లుదండాలు చేసి వినూత్నరీతుల్లో నిరసన తెలిపారు.


అనంతపురంలో రోడ్డుపై సహపంక్తి భోజనాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమ్మెలో భాగంగా 9వ రోజైన బుధవారం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు నగరంలోని ప్రధాన రహదారిపై సహపంక్తి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షా శిబిరాన్ని మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, సిఐటియు 1వ పట్టణ కార్యదర్శి వెంకటనారాయణ, 2వ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గురురాజా, ముర్తుజా సందర్శించి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచి కార్మికుల కడుపు కొట్టేలా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన వేతనాలకు నిధులు లేవనడం పాశవిక వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమం పట్టడం లేదన్నారు. సాక్షాత్తు సిఎం జగన్ ఇచ్చిన హామీలను విస్మరించి మాట తప్పడం దుర్మార్గమన్నారు. ఇకనైనా కార్మికుల న్యాయమైన డిమాండ్లను ఆమోదించి సత్వరం న్యాయం చేయకుంటే నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, నల్లప్ప, మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు, బండారి ఎర్రి స్వామి, సాకే తిరుమలేష్, మల్లికార్జున రాయుడు, ఓబుల పత్తి మురళి, లక్ష్మి నరసమ్మ మంత్రి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసనాగ్రహం

పాలకవర్గం, అధికారులు ప్రయివేట్ వ్యక్తుల చేత తరలిస్తున్న చెత్త ట్రాక్టర్‌ను మున్సిపల్ కార్మికులు ఆపి నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో, కమిషనర్ ఛాంబర్ ముందు వేసి నిరసన తెలిపారు. ఇకనైనా అధికారులు, పాలకవర్గం, ప్రభుత్వం వెంటనే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిచో రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఇళ్ల వద్ద చెత్త వేయడంతో పాటు నీళ్లు, వీధి దీపాలను ఆపేసి సమ్మెను ఉధృతం చేస్తామని మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, పారిశుధ్య కమిటీ సభ్యులు, మిత్ర సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిల్చొని నిరసన

గుత్తి : ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మెకు సిపిఎం, సిపిఐ, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు శిబిరంలో బైఠాయించి సంఘీభావం తెలిపారు. మున్సిపల్ కార్మికులు ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిపిఐ మండల కార్యదర్శి జి.రామదాసు, నాయకులు షేక్ నజీర్,రాజు, నరసింహయ్య, పూల మాబు, మహమ్మదా, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్.ఈరన్న, సత్య, బీఎస్పీ నాయకులు గద్దల నాగభూషణం, వెంకట కొండయ్య, విజయ్, బండల రామాంజనేయులు, కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.రామాంజనేయులు, కె. సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి సుంకన్న, కోశాధికారి బాలరంగన్న, నాయకులు బేడల నాగేంద్ర, ఈశ్వరయ్య, కె.ఆంజనేయులు, ఇంజినీరింగ్ విభాగ కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎస్.రాజా, ఉపాధ్యక్షుడు ఎస్ఎ.మురళి, కార్యదర్శి రవిశంకర్, సహాయ కార్యదర్శులు నరసింహ, ఆది, కోశాధికారి నక్కా శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పొర్లుదండాలతో నిరసన

గుంతకల్లు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజినీరింగ్ కాంట్రాక్టు కార్మికులు సిఐటియు అనుబంధ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు కె.నరసయ్య నాయకత్వంలో శిబిరం ఎదుట రోడ్డుపై సిఎం జగన్ రెడ్డికి పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. వీరి సమ్మెకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, సిఐటియు పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ కార్యదర్శి జగదీష్, నాయకులు దాసు, మల్లేష్, సూరి, రాకెట్ల మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

శిబిరం వద్దే వంటావార్పు

రాయదుర్గం : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరం వద్దనే వంటావార్పు చేసి భోజనాలు చేసి నిరసన వ్యక్తం చేశారు.


అనంతపురం మున్సిపల్ కార్యాలయంలో చెత్త వేసిన కార్మికులు


గుత్తిలో ఒంటికాలిపై నిల్చొని కార్మికుల నిరసన

ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టండి

పింఛను పెంపు మహోత్సవాల్లో ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేస్తుంటే ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలు నిత్యం కుట్రలు చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని కృష్ణకళామందిర్, సోమనాథ్‌నగర్‌లోని రజక కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించిన పింఛను పెంపు మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. హామీ మేరకు సిఎం జగన్ పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచారన్నారు. టిడిపి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 39 లక్షల మందికి పింఛన్లు ఇవ్వగా, వైసిపి ప్రభుత్వం 66.34 లక్షల మందికి అందిస్తుందన్నారు. అనంతపురం నియోజకవర్గంలో 28 వేల మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. అంతకుముందు లబ్ధిదారులతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమాల్లో మేయర్ వసీం, కమిషనర్ భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ ఓబిరెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత

దేశానికే ఆదర్శం : ఎమ్మెల్సీ

ఉరవకొండ : సామాజిక పింఛన్ల పంపిణీలో సిఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కొనియాడారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పింఛను మొత్తం రూ.3 వేలకు పెంచిన ఘనత వైసిపిదే అన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఇందిరమ్మ, ఎంపిడిఒ విజయలలిత, ఎంపిటిసిలు మునయ్య, ముద్దయ్య, నాయకులు లాలెప్ప, రామచంద్ర, పాపన్న, గురు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే వైసిపి ధ్యేయం : ఎమ్మెల్యే

శింగనమల : సిఎం జగన్ పేదల జీవితాల్లో ఆనందం నింపడానికే సంక్షేమ పథకాలు అందిస్తు న్నారని, అందులో భాగంగానే వైఎస్ఆర్ పింఛను కానుకను రూ. 3వేలకు పెంచారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గార్లదిన్నె మండలం బూదేడు గ్రామ సచివాలయం, శింగనమల మండల పరిషత్ కార్యాలయం, నార్పల మండలం కేశేపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమం లో ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ నిర్మలకుమారి, నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు. నార్పల మండలం కేశేపల్లిలో తహశీల్దార్ హరికుమార్, ఎంపిపి బూసిగాని నాగేశ్వరావు, జడ్పి వైస్ ఛైర్‌పర్సన్ వేదాంత నాగరత్నమ్మ పాల్గొన్నారు. గార్లదిన్నె మండలం బూదేడులో ఎంపిడిఒ విజయభాస్కర్, ఎంపిపి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


వజ్రకరూరు మండలం కొనకొండ్లలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి


బూదేడులో పింఛను పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

జనసేన బలోపేతమే లక్ష్యంగా పనిచేద్దాం

పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

జనసేన పార్టీని పూర్తిస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని జిల్లా అధ్యక్షులు, అనంతపురం అర్బన్ ఇన్‌ఛార్జి టిసి.వరుణ్ పిలుపునిచ్చారు. నగర కార్యదర్శులు లాల్‌స్వామి, వల్లంశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం నగర శివారులోని నారాయణపురం పంచాయతీ తపోవనం సర్కిల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్నిముఖ్య అతిథి టిసి వరుణ్ ప్రారంభించారు. క్రియాశీలక కిట్లు పంపిణీ చేశారు. నగర అధ్యక్షులు పొదిలి బాబురావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వరుణ్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జనసైనికులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు మురళీకష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు సంజీవ రాయుడు, కిరణ్ కుమార్, సిద్దూ, జయమ్మ, అవుకు విజయకుమార్, ముప్పూరి కష్ణ, నగర ఉపాధ్యక్షులు గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, హుస్సేన్, దరాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


కిట్లు పంపిణీ చేస్తున్న టిసి వరుణ్

ఓటర్ల తొలగింపుపై తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు : ఇఆర్ఒ

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపుపై తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని రాయదుర్గం నియోజకవర్గ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఇఆర్ఒ) కరుణకుమారి సహాయ ఓటర్ల రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇఆర్ఒ మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేర్ల తొలగింపుపై పెద్దఎత్తున తప్పుడు దరఖాస్తులు సమర్పిస్తే, వాటిపై విచారణ జరిపి అవి నిరాధారమని తేలితే, పెట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెల 10వ తేదీ వరకూ ఓటర్ల జాబితాలో సవరణలు, చేర్పులు, మార్పులకు గడువు ఉందన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకూ వచ్చిన దరఖాస్తులను విచారణ జరిపి తగిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలను తహశీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో పరిశీలించవచ్చు అన్నారు. ఎన్నికల సెక్టార్, బూత్ స్థాయి అధికారులు పోలింగ్ స్టేషన్లను సందర్శించి మౌలిక సౌకర్యాలను పరిశీలించాలన్నారు. అవసరమైతే మున్సిపల్ పంచాయతీరాజ్ అధికారులు మరమ్మతులు చేయిస్తార న్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలపాలని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల తహశీల్దార్లు, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఇఆర్ఒ కరుణకుమారి

ఇసుక టిప్పర్లపై కానరాని నియంత్రణ

పెద్దపప్పూరు వద్ద లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతుందనడానికి, రవాణాదారులు పేట్రేగి పోతున్నారనడానికి బుధవారం పెద్దపప్పూరు వద్ద చోటుచేసుకున్న సంఘటనే నిదర్శనం అన్న విమ ర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దపప్పూరు వద్ద ఉన్న రీచ్‌లో ఇసుక లోడ్ చేసుకొని అనంతపురం వెళ్తున్న ఓ టిప్పర్ తబ్జుల గ్రామ సమీపంలో బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. ముందు వెళు తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా దాటే క్రమంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రాళ్లను ఎక్కించడంతో టైరు పగిలి టిప్పర్ రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఈ మార్గంలో ఇసుక టిప్పర్లు అడ్డూఅదుపూ లేకుండా అతివేగంగా రాకపోకలు సాగించడం వల్ల వాహనదారులు, రోడ్డు సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటల పాటు ఇసుక టిప్పర్లు అతివేగంగా ఇసుకను రవాణా చేస్తుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ఆ మార్గంలోని గ్రామల ప్రజలు వాపోతున్నారు. టిప్పర్లు తహశీల్దార్ కార్యాలయం ఎదురుగానే యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నా అడిగే వారు కరువయ్యారు. ఈ విషయమై ప్రజా సంఘాల నాయకులు ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా, టిప్పర్లను అడ్డుకున్నా వాటికి అడ్డుకట్ట పడడం లేదు. టిప్పర్ బోల్తా పడిన సమయంలో అటుగా వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై బోల్తా పడిన ఇసుక టిప్పర్

కెజిబివిలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-నార్పల

స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయ (కెజిబివి)లో మండల పరిధిలోని హెచ్.సోదనపల్లి గ్రామానికి చెందిన అశ్విని 9వ తరగతి చదువుతోంది. ఆమె బుధవారం తలలో పేళ్లకు వాడే మందు తాగింది. విషయం తెలిసిన వెంటనే పాఠశాల సిబ్బంది స్థానిక వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించి 108 ద్వారా అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఒ నిర్మలను వివరణ కోరగా కొందరు విద్యార్థినులు గొడవపడ్డారని, ఈ క్రమంలో వ్యక్తిగత విమర్శలు చేయడంతో మనస్థాపానికి గురైన అశ్విని పేళ్ల మందు తాగిందన్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు ఎస్ఒ తెలిపారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలపాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు కెజిబివి వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలిసి వెంటనే మండల విద్యాశాఖ ధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎఎస్ఐ ఈశ్వరయ్య అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని తెలిపారు.


కెజిబివి ముందు ఆందోళనకారులతో మాట్లాడుతున్న అధికారులు


రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కథనానికి స్పందన

కేశేపల్లి వద్ద గుంతలు పూడ్చివేత

నార్పల : మండల పరిధిలోని కేశేపల్లి బ్రిడ్జి వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలకు బుధవారం ఆర్‌అండ్‌బి అధికారులు ప్యాచ్ వర్క్ చేశారు. ఈ మార్గంలో ఇటీవల ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. కేశేపల్లి బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలపై ప్రజాశక్తిలో 'తల్లిదండ్రుల కడుపుకోతకు కారణమైన గుంతలు' శీర్షికన వెలువడిన కథనానికి స్పందించిన ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి గుంతలు పూడ్పించి మరమ్మతులు చేయించారు.

5న ఇంటి పన్నులపై గ్రామసభ

పామిడి : పామిడి గ్రామపంచాయతీలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ బుధవారం తెలిపారు. పంచాయితీ ఆవరణలో జరిగే గ్రామ సభలో ఇంటి పన్నులు, ఇతర అభివృద్ధి పనులపై చర్చిస్తామని, పంచాయతీలోని ప్రజలందరూ తప్పక హాజరు కావాలని కోరారు.

చంద్రబాబుకు 'డేగల' సన్మానం

శింగనమల : పంచాయతీరాజ్, సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడలో జరుగుతున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ ఇన్‌ఛార్జి డేగల కృష్ణమూర్తి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు.


చంద్రబాబును సన్మానిస్తున్న డేగల కృష్ణమూర్తి

ఇటుకల తయారీ పరిశ్రమలో కార్మికుడి మృతి

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని రావివెంకటంపల్లి గ్రామం వద్ద ఉన్న భైరవ బ్రిక్స్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న నవీన్(20) బుధవారం ప్రమాదవశాత్తు బ్రిక్స్ తయారీ మిషన్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ మహమ్మద్ గౌస్, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

కంపోస్ట్ యార్డులో మంటలు.. ఆర్పిన అగ్నిమాపక దళం

రాయదుర్గం : పట్టణంలోని బళ్లారి రోడ్డు పోలిమేరలో ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డులో మంగళవారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక దళం, మున్సిపల్ సిబ్బంది వెంటనే వెళ్లి మంటలను ఆర్పినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, వైసిపి నాయకులు పొరాలు శివ, దివాకర్, పారిశుధ్య పర్యవేక్షకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


చెత్త యార్డులో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక దళం

ఐదుగురు పేకాటజూదరులు అరెస్టు

పుట్లూరు : స్థానిక చెరువు కట్ట వద్ద జూదం ఆడుతున్నారని సమాచారం రావడంతో పోలీసులు దాడులు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ. 1,340 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.మండల పరిధిలోని గాండ్లపాడు, ఎస్.గూడూరు, మడుగుపల్లె గ్రామాలకు చెందిన ఐదుగురు రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పామిడి

గుంతకల్లు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని వెంగమనాయుడు కాలనీలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయనకు కాలనీవాసులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి సూపర్ సిక్స్ పథకాలు, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనపై వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, సిఎం జగన్ ఇంటికెళ్లడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నరాయుడు, బేతాపల్లి శీన, చంద్రశేఖర్, శ్రీనివాసులు, కుళ్లాయప్ప, రఘు, తిప్పేస్వామి, కోటేశ్వర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల పరిధిలోని తక్కళ్లపల్లి పంచాయతీలో బుధవారం టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్ నాయుడు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటేసి టిడిపిని గెలిపించాలని కోరారు. మినీ మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు శివశంకర్‌రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌నాయుడు, రంగప్ప, సూర్యుడు, రాధ, రాజు, చంద్రశేఖర్, గంగయ్య, నరసింహ, జీవన్, పాల్గొన్నారు.


టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న సురేష్‌బాబు

ఎస్ఐగా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

శింగనమల : శింగనమల నూతన ఎస్ఐగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురంలో నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న చంద్రశేఖర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఉన్న ఎస్ఐను అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో మట్కా, గుట్కా, పేకాట కార్యకలాపాలు నిర్వహిస్తే జైలు తప్పదని హెచ్చరించారు. ఏమైనా సమస్యలు వుంటే మా దృష్టికి తెస్తే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు



చంద్రబాబును కలిసిన ఉపాధ్యాయుడు

కళ్యాణదుర్గం : నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ బుధవారం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు సంగప్ప టిడిపి అధినేత చంద్రబాబుని కలిసి కోరారు. సంగప్ప మంగళగిరిలో చంద్రబాబుని కలిసి తాను బిసి సామాజిక వర్గానికి చెందిన వాడినని, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఉంటూనే ఎన్నో ఏళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అనతరం వంద పేజీలతో కూడిన తన వ్యక్తిగత ప్రొఫైల్‌ను చంద్రబాబుకు అందజేశారు.


చంద్రబాబుని కలిసిన సంగప్ప

ఎమ్మెల్యే టికెట్ 'కాపు'కే ఇవ్వాలని సిఎం జగన్‌కు వినతి

రాయదుర్గం : రాబోయే ఎన్నికల్లో రాయదుర్గం ఎమ్మెల్యే టికెట్ రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికే ఇవ్వాలని పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు సిఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో పురపాలక సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మేకల శ్రీనివాసులు, కౌన్సిలర్లు గోవింద, ఫకృద్దీన్, వన్నూరప్ప, షబ్బీర్, ఉష, వార్డ్ ఇన్‌ఛార్జులు మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి కాపు పార్టీలోనే ఉంటూ ప్రజాసేవ చేశారన్నారు. కాపు ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరారు.


సమావేశమైన ఎమ్మెల్యే కాపు మద్దతుదారులు

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం సందర్శన

అనంతపురం : నగరంలోని హమాలీకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత కార్యక్రమాన్ని డిఎంహెచ్ఒ డా. ఈబి దేవి సందర్శించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు హెల్త్ క్యాంప్స్‌ను ఉపయోగించు కోవాలన్నారు. వైద్య శిబిరాలకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి తెలిపారు. ప్రజల దగ్గరకి వెళ్లి వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి వైద్య ఉద్యోగి చిత్తశుద్ధితో సేవలు అందించాలని సూచించారు.


శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఒ దేవి

వికలాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలి

ఆత్మకూరు : ఆర్టీసీ బస్సుల్లో వికలాంగుల(స్త్రీ,పురుషులు)కు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రామయ్య బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలనే ఆలోచనలో ఉన్నందున వికలాంగులకు సైతం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకో వాలని కోరారు. వికలాంగులకు ప్రత్యేక బస్సులు కేటాయించాలని, పంఛను రూ. 3 వేల నుంచి రూ. 6వేలకు పెంచాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఈ.గంగన్న, రాజశేఖర్, నారాయణరెడ్డి, సునీత, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు

అక్రమ నిర్మాణాలను ఆపాలని ధర్నా

పెద్దపప్పూరు : స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కన చౌడేశ్వరీదేవి రచ్చకట్ట పక్కన దౌర్జన్యంగా అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను వెంటనే నిలిపేయాలని కోరుతూ బుధవారం గ్రామానికి చెందిన తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టి, వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చౌడేశ్వరీదేవి రచ్చ కట్ట పక్కన ఉన్న స్థలాన్ని వడ్డే రవి దౌర్జనంగా ఆక్రమించుకొని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతా పురుషోత్తం, ఆలయ ధర్మకర్త చింతా కర్ణ, బండారు ప్రకాశ్, దాసరి రామకృష్ణ, సిద్ధినాథం, ఓబులేసు, నారాయణస్వామి, చింతా సూర్యనారాయణ, లింగం లోకేష్, కాసెట్టి నారాయణస్వామి, నాగయ్య, తమ్మిశెట్టి శ్రీనివాసులు, నారాయణస్వామి, రాము, పూజారి నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా మమత

అనంతపురం : జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా డాక్టర్ జి.మమత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన, రెక్టార్ ఆచార్య ఎంవిజయ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆమెకు సీనియర్ ఆచార్యులు రమణారెడ్డి, గిరిప్రసాద్, విష్ణువర్ధన్, తదితరులు అభినందనలు తెలిపారు

జాతీయ చెస్ పోటీల్లో శ్రీహ ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

ఇటీవల వేలూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపి అండర్-14 బాలికల జట్టు 3వ స్థానం సాధించింది. ఈ జట్టు కెప్టెన్‌గా అనంతపూర్‌కు చెందిన జి.శ్రీహ కీలక పాత్ర పోషించింది. మొత్తం ఆరు రౌండ్ల పోటీలు నిర్వహించగా 17/24 పాయింట్లతో 3వ స్థానం కైవసం చేసుకున్నారు. శ్రీహతో పాటు తల్లిదండ్రులు లక్ష్మీనారాయణ(ఎంఆర్‌ఓ), శిరీష, కోచ్ ఆదిరత్నకుమార్‌లను ఆల్ అనంతపురం చెస్ అసోసియేషన్ సెక్రటరీ ఉదయ్ కుమార్ నాయుడు అభినందించారు. తన విజయంలో తన తండ్రి కంబగిరి స్వామి కీలక పాత్ర పోషించారని అస్మిత అనిమి తెలిపింది.

ఆలయ అభివృద్ధికి విరాళం

అనంతపురం : నగరంలోని 1వ రోడ్డులో వెలసిన కాశీవిశ్వేశ్వరకోదండ రామాలయం, అయ్యప్పస్వామి ఆలయాల మరమ్మతులకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేయించారు. 20 శాతం భక్తులు చెల్లించాలని కోరగా వినాయక బిల్డర్స్ అధినేత లక్ష్మీరెడ్డి శ్రీనివాసులు రూ. 5,00,000 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జ్వాలపురం శ్రీకాంత్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు

ప్రజాశక్తి-బెలుగుప్ప

రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చునని ఉద్యాన శాస్త్రవేత్త కెవికె యుగంధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గంగవరం, సీర్పి, దుద్దేకుంట గ్రామాల్లో బుధవా రం ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు సాగుచేసిన అరటి, మిరప పంటలను పరిశీలించారు. అరటి, ఎండుమిరప పంటల్లో సీజనల్ తెగుళ్ళు, వాటి యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలను రైతులకు వివరిం చారు. ఉద్యాన శాఖ అమలు చేసే పథకాలు, రాయితీలను తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు యుగంధర్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కెవికె ఎం.కృష్ణతేజ, ఆర్‌బికె అధికారులు, రైతులు పాల్గొన్నారు

సావిత్రిబాయి పూలేకి నివాళి


పుట్లూరులో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


పెద్దవడుగూరులో సావిత్రిబాయి పూలేకు నివాళి

పెద్దవడుగూరు : మండల పరిధిలోని చిత్రచేడు జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయురాలు విజయమేరీని సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని పెన్షనర్ల భవనంలో ఏపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షులు కె.అబూబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి కుళ్లాయిబాబు, నాయకులు వెంకటేష్, లక్ష్మీనారాయణరెడ్డి, షేక్షావలి, నారాయణరెడ్డి, హాసన్ అహ్మద్, చెన్నారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సంపత్‌కుమార్, పాల్గొన్నారు.

పుట్లూరు : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయురాళ్లను పూలమాలలు శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఉరవకొండ : వజ్రకరూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రంగప్రసాద్ అధ్యక్షతన అంతర్జాతీయ సేవా భారతి అవార్డు గ్రహీత ఎంపి మల్లికార్జున ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హాజీ పట్టా ఖాజాపీరా, ఉపాధ్యాయ బృందం భాగ్యరేఖ, కౌసల్య, అరుణకుమారి, అశోక్‌కుమార్, గోవిందరాజులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, ఓనర్ల ఆందోళన

ప్రజాశక్తి-ఉరవకొండ

కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై తీసుకొస్తున్న కొత్త నల్ల చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉరవకొండలో డ్రైవర్, ఓనర్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు స్థానిక టవర్ క్లాక్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ సభ్యులు జాఫర్‌వలి, మహబూబ్‌ఖాన్, హోతూరుబాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తీసుకొచ్చే ప్రయత్నాన్ని తక్షణమే విరమించుకోవాలని, లేనిచో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో లారీ టాక్సీ, బస్సు ఓనర్లు, డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు సుధాకర్, నబి, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన అంగన్వాడీలు

పుట్లూరు : సమ్మెలో భాగంగా కలెక్టరేట్‌ల ముట్టడికి పిలుపునివ్వడంతో మండలవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, సిపిఎం నాయకులు అనంతపురం తరలివెళ్లారు. వారితో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.నూరి, మండల అధ్యక్ష, కార్యదర్శులు టి.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, మండల రైతు సంఘం సహాయ కార్యదర్శి వెంకటచౌదరి, కెవిపిఎస్ మండల కార్యదర్శి నాగభూషణ్, అంగన్వాడీ మండల అధ్యక్షురాలు జయలలిత, అనంతలక్ష్మి, రమాదేవి, తదితరులు ఉన్నారు.

పామిడి : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు మండల పరిధిలోని ఎద్దులపల్లి, పామిడి సెక్టార్ల నుంచి వందమందిగా పైగా అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అనంతపురం తరలి వెళ్లారు. వీరికి మండలం సిపిఎం కార్యదర్శి మల్లేష్ మద్దతు ప్రకటించారు.

ప్రజాశక్తి డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న లిఖిత


తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి...

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం : ఆంగ్ల నూతన సంవత్సరాది పురస్కరించుకొని ప్రజాశక్తి దినపత్రిక రూపొందిం చిన క్యాలెండర్, డైరీలను బుధవారం పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఎడిసిసి బ్యాంక్ ఛైర్‌పర్సన్ లిఖిత, మాజీ ఛైర్మన్ వీరాంజనేయులు, అర్బన్ బ్యాంకు అధ్యక్షులు జెఎల్.మురళి, ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త మాసినేని రామయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : ప్రజాశక్తి-2024 క్యాలెండర్‌ను పట్టణంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆవిష్కరించారు. ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదానికి అక్షర రూపం ప్రజాశక్తి పత్రిక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజలకు వార్తలు అందిస్తున్న పత్రిక అని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి పాత్రికేయులు వెంకటరామిరెడ్డి, ఆదినారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : నగరంలోని డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ కాలమనిని పట్టిక, డైరీలను డిఎంహెచ్‌ఒ డా.ఈబి.దేవి ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ క్యాడర్‌లో గ్రేడ్-1 ప్రమోషన్లు, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనం పెంపు, సెలవులు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డా. పాల్ రవికుమార్, అడిషనల్ డిఎంహెచ్‌ఒ డా. సుజాత, డిపిఎంఒ డా. రవిశంకర్, మలేరియా అధికారి ఓబులు, ఎఒ గిరిజామనోహర్‌రావు, అసోసియేషన్ సెక్రటరీ వేణుగోపాల్, కోశాధికారి శ్రీనివాసులు, సుదర్శన్ శర్మ, మస్తాన్‌వలి, మధుబాబు, సుజాత, తనూజ తదితరులు పాల్గొన్నారు. ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది కాలమనిని పట్టిక, డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం జెఎసి ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే ధ్రువీకరణ పత్రం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రైతులను అన్ని రకాలుగా ఆదుకోవడంతో పాటు, దేశంలోనే మేలైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తమ యాజమాన్య పద్ధతుల ధ్రువీకరణ పత్రం పథకాన్ని అమలు చేస్తుందని ఎక్స్‌టర్నల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవి తెలిపారు. మండల పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో సాగు చేసిన అరటి పంటలో బుధవారం రవితో పాటు ఉద్యాన అధికారుల బృందం పరిశీలించింది. రవి మాట్లాడుతూ ఈ పథకం దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలను తీర్చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అరటిలో కాయ నాణ్యత పెంపుదల, కూలీల ఆరోగ్యం, భద్రత, తక్కువ పెట్టుబడితో రైతులకు అధిక గిట్టుబాటు ధర కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఉత్పత్తిదారుల కంపెనీలతో ఒప్పందం చేసుకున్న 73 మంది ఉద్యానవన అరటి తోటలకు వెళ్లి రైతుల సమక్షంలో వారి తోటలో అరటి నమూనాలు సేకరించారు. నమూనాలో పురుగుమందులు, ఎరువుల విశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవడానికి బెంగళూరు లోని పరీక్షా కేంద్రానికి పంపించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ ఉద్యాన అధికారి బిఎంవి.నరసింహారావు, మండల ఉద్యాన అధికారి ఎస్.ఉమాదేవి, రైతు భరోసా కేంద్రం అధికారి నితిన్, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ ఉద్యోగి మృతి

రాయదుర్గం : మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.నీలకంఠారెడ్డి బుధవారం మృతి చెందారు. అనారోగ్య కారణాల వల్ల సెలవులో ఉన్న ఆయన స్వస్థలం గుంతకల్లులో తెల్లవారుజామున మృతి చెందినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ఆయన మృతి పట్ల ఛైర్‌పర్సన్ పోరాలు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మేనేజర్ ప్రసాద్, కౌన్సిలర్లు శారద, పద్మజ, లావణ్య, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, వైసిపి నాయకులు శివ, శ్రీరామ్‌రెడ్డి, రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ శివప్ప, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో బి.పప్పూరు సర్పంచి మృతి

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామ సర్పంచి చీమల పెద్దన్న బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని గ్రామానికి తీసుకు రావడం తో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడు మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి నాయకులు పిట్టు రంగారెడ్డి, మండల అధ్యక్షులు ఎర్రినాగప్ప, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, గంగనపల్లి రాము, బండ్లపల్లి సర్పంచి వెంకటనారాయణమ్మ, నదిమిదొడ్డి సర్పంచి నాగార్జున, నాయకులు రాజన్న, కుళ్లాయప్పతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దన్న మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

విద్యార్థికి అభినందన

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ అనిల్‌కుమార్ హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్‌లో ప్రతిభ కనబరచినందుకు బుధవారం ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి, అధ్యాపక బృందం అభినందించారు. క్యాంప్‌లో 4 రాష్ట్రాల యూనివర్సిటీలకు చెందిన వలంటీర్లు పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో నదులు దాటడం, పర్వత శిఖరాలు అధిరోహించడం, ప్రమాదాలు ఏర్పడినప్పుడు, ప్రమాదంలో ఉన్న వారిని ఎలా రక్షించాలో తెలుసుకోవడంతో పాటు హిమాచల్‌ప్రదేశ్ సహజసౌందర్యం, అక్కడి జీవన శైలి, ఒక గొప్ప అనుభూతి కలిగించిందని అనిల్ తెలిపాడు. అభినందన కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కంది పంట కోత పరిశీలన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని గ్రామదట్ల పొలాల్లో చేపట్టిన కంది పంట కోత ప్రయోగాన్ని బుధవారం రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్, ఎఒ మహేంద్రతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 100 చదరపు మీటర్లలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 3.250 కిలోల దిగుబడి వచ్చిందన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

రాయదుర్గం : ఎల్ఐసి క్లాస్-1, 2, 4 ఉద్యోగుల యూనియన్ సంయుక్త పిలుపుమేరకు బుధవారం పట్టణం లోని ఎల్ఐసి కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సంస్థ ఉద్యోగులు, అధికారులు నిరసన ప్రదర్శన చేపట్టారు. వేతన సవరణ, ఖాళీ పోస్టుల భర్తీ, పెన్షన్ చెల్లింపుల్లో సంస్థ భాగం చెల్లింపు శాతం 14కు పెంచడంతో పాటు ఏకపక్ష నిర్ణయ వైఖరిని విడనాడాలని నినాదాలు చేశారు. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 12:30 నుంచి 1.30 గంటల వరకు వాక్ అవుట్ కార్యక్రమం నిర్వహి స్తామని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమానికి సతీష్, రవికుమార్, ఆదినారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహించగా వివిధ స్థాయి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు